



మూతపడిన ఆగ్రోస్ ఆధునిక యంత్ర పరికరాల ప్రదర్శన కేంద్రం



అనంతపురం ఆగ్రోస్ కార్యాలయం



సంస్థలో మూలనపడ్డ ఎక్స్‌కవేటర్లు

అంపశయ్యపై ఆగ్రోస్..?

గతంలో రైతులకు మెరుగైన సేవలు

- వైసీపీ పాలనలో అధ్వాన పరిస్థితి
- నైపుణ్యం కలిగిన ఉద్యోగులు అవసరం
- గతంలోలా పనులు అప్పగిస్తే పూర్వవైభవం
- కూటమి ప్రభుత్వం చొరవపై గంపెడాశలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15: రైతులకు మెరుగైన సేవలు అందించిన ఏపీ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఏపీ ఆగ్రోస్) నిర్వహణ అంపశయ్య మీదకు చేరినట్లు అగుపిస్తోంది. గత వైసీపీ పాలనలో సంస్థ నిర్వహణ చాలా అధ్వానంగా మారింది. 1968 సంవత్సరంలో రాష్ట్ర స్థాయితో పాటు జిల్లాలో ఏపీ ఆగ్రోస్ రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సంస్థ ఏర్పాటు చేసిన తొలినాళ్లల్లో పెద్ద ట్రాక్టర్లు, బుల్డోజర్లు, ఎక్స్‌కవేటర్లను రైతులకు అద్దెకు ఇచ్చేవారు. తద్వారా పొలాల్లో పలు రకాల పనులు చేయించేవారు. పొలాలను చదును చేసేందుకు, ఇతరత్రా పనులు చేయడం ద్వారా రైతులకు చేయూతనిచ్చారు. ఆ తర్వాత 1975 సంవత్సరం నుంచి ఆగ్రోస్ సంస్థ ద్వారా రైతుల పొలాల్లో బోరుబావులు తవ్వించారు. 2020 దాకా బుల్డోజర్లను అద్దెకు ఇస్తూ వచ్చారు. ఆ తర్వాత బుల్డోజర్లు కాలం చెల్లడంతోపాటు రైతులకు అందుబాటులోకి పెద్ద యంత్రాలు రావడంతో ఆగ్రోస్‌కు చెందిన బుల్డోజర్లకు ప్రాముఖ్యం తగ్గిపోయింది.

గతంలో మెరుగైన సేవలు

అనంతపురం ఆగ్రోస్ రీజినల్ కార్యాలయం పరిధిలోని ఉమ్మడి అనంత జిల్లాతోపాటు కర్నూలు రైతులకు సంస్థ ద్వారా గతంలో మెరుగైన సేవలు అందించారు. 2005 నుంచి 2012 దాకా జిల్లాలోని అన్ని మండలాల్లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సబ్సిడీతో యంత్రీకరణ పరికరాలు, వ్యవసాయ పనిముట్లను ఆగ్రోస్ ద్వారా రైతులకు పంపిణీ చేసేవారు. అలాగే పలు రకాల యాంత్రీకరణ పరికరాలను రైతులకు అద్దెకు ఇచ్చి పొలాల్లో పనులు చేసేందుకు దోహదపడ్డారు. అప్పట్లో ఆయా సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు, క్రిమి సంహారక మందులు పంపిణీ చేసేవారు. 2017లో రైతులకు రెయిన్‌గన్స్‌ను కూడా విక్రయించారు.

మూతపడిన యాంత్రీకరణ కేంద్రం

అనంతపురం ఆగ్రోస్ సంస్థ పరిధిలో 2017 సంవత్సరంలో ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం లో ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రదర్శించి అవగాహన కల్పించేవారు. అలాగే ఆధునిక యంత్ర పరికరాలను అద్దె ప్రతిపాదికన రైతులకు అందించేవారు. తద్వారా రైతులు తమ పొలాల్లో అవసరమైన పనులు చేసుకునేవారు. గత ఐదేళ్లుగా యాంత్రీకరణ ప్రదర్శన కేంద్రం మూతపడింది. దీంతో రైతులకు ఆధునిక యంత్ర పరికరాలపై అవగాహన కల్పించేవారే లేరు.



నిరుపయోగంగా ఆధునిక యంత్ర పరికరాలు

ఖాళీగా ఉద్యోగులు, సిబ్బంది..!

అనంతపురం ఆగ్రోస్ కార్యాలయంలో ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఆర్ఎం బీవీ కృష్ణారెడ్డితో పాటు 9 మంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో నలుగురు రెగ్యులర్ డ్రైవర్లు, మిగతా సిబ్బంది అవుట్ సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం సంస్థలో ఎలాంటి పనులు లేకపోవ డంతో అక్కడ పనిచేసే సిబ్బంది ఖాళీగా ఉండాల్సి వస్తోంది. ఆగ్రోస్ సంస్థ ద్వారా గతంలో చేసిన పలు రకాల పనులు మళ్లీ అప్పగిస్తే తాము చేసేందుకు పని ఉంటుందని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల కిందట జిల్లాలో పదుల సంఖ్యలో కార్యాలయ అధికారులు, ఉద్యోగులతో పాటు ఫీల్డ్ సిబ్బంది పనిచేసేవారు. ఆగ్రోస్ ద్వారా అందించే సేవలు క్రమంగా తగ్గిపోయాయి. ఉన్న అధికారులు సైతం ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం గుంటూరు ఆగ్రోస్ హెడ్ ఆఫీస్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బీవీ కృష్ణారెడ్డి అనంతపురం, చిత్తూరు రీజియన్లకు ఇన్‌చార్జి ఆర్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సంస్థలో అధికారులు కొరత తీవ్రంగా ఉందనేందుకు ఇదే నిదర్శనం.



సంస్థలో మూలనపడ్డ పలు వాహనాలు

అనంతలో రూ.కోట్ల విలువైన భూమి

ఏపీ ఆగ్రోస్‌కు జిల్లా కేంద్రంలో రూ.కోట్ల విలువైన భూమి ఉంది. అనంతపురం నగరం బళ్లారి రోడ్డులో 2.80 ఎకరాల విస్తీర్ణంలో ఏపీ ఆగ్రోస్ సంస్థ కార్యాలయం ఉంది. ఇందులో 90 సెంట్లను బొరుగుల ఫ్యాక్టరీకి లీజుకు ఇచ్చారు. క్లాక్ టవర్ వద్ద మూడు షాపులను అద్దెకు ఇచ్చారు. ఏపీ ఆగ్రోస్ సంస్థ రాష్ట్ర శాఖలో రూ.100 కోట్ల డిపాజిట్ ఉన్నట్లు సమాచారం. సంస్థలో డబ్బులకు కొదవలేదని ఆ సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి అనంత జిల్లా తరఫున వైసీపీ నాయకుడు నవీన్‌నిశ్చల్‌ను ఏపీ ఆగ్రోస్ ఛైర్మన్‌గా నియ మించారు. అయినప్పటికీ ఏపీ ఆగ్రోస్ సంస్థ పురోభివృద్ధికి ఆయన ఎలాంటి ప్రత్యేక చొరవ తీసుకోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఛైర్మన్ హోదాలో ఆగ్రోస్ కు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేయలేదన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో ఆగ్రోస్ సంస్థకు పూర్వ వైభవం వస్తుందన్న ఆశతో ఆ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆగ్రోస్ సంస్థపై ప్రత్యేక దృష్టి సారించి, సంస్థకు కావాల్సిన అధికారులు, నైపుణ్యం కలిగిన ఇంజనీర్లను నియ మించి, గతంలో చేపట్టిన పలు రకాల పనులు సంస్థ ద్వారా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే సంస్థ మూత పడటం ఖాయమన్న వాదనలు ఆసంస్థ అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపితేనే భవిష్యత్తు

గత కొన్నేళ్లుగా ఏపీ ఆగ్రోస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాం. సంస్థలో పనిచేసే అధికారులు ఒక్కొక్కరుగా ఉద్యోగ విరమణ పొందుతూ వచ్చారు. ఇదే క్రమంలో సంస్థ ద్వారా అందించే పలు రకాల సేవలు తగ్గుతూ వచ్చాయి. ప్రస్తుతం అన్ని రకాల పనులు స్తంభించి పోయాయి. జిల్లా కేంద్రంలో సంస్థకు రూ.కోట్ల విలువ చేసే భూమి ఉంది. ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సంస్థకు పూర్వవైభవం తీసుకువచ్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలి. గతంలో మాదిరే సంస్థ ద్వారా రైతులకు సబ్సిడీతో యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేసేలా నిర్ణయం తీసుకోవాలి. రైతులకు అవసరమైన మరిన్ని సేవలు సంస్థ ద్వారా చేపడితే రైతులకు ప్రయోజనం కలగడంతోపాటు సంస్థ బతికిబట్టకడుతుంది.

-బీవీ కృష్ణారెడ్డి, అనంతపురం ఏపీ ఆగ్రోస్ ఇన్‌చార్జ్ ఆర్ఎం

యాపారం మొదలైంది..!

- సెటిల్ చేసుకో.. లేకుంటే ఇబ్బందులే
- ఆయిల్ మిల్ వ్యాపారికి వైసీపీ, టీడీపీ నేతల బెదిరింపులు
- రూ.10 కోట్ల భూమిపై కబ్జాదారుల కన్ను
- ఈ స్థలం తమదేనంటూ రంగంలోకి దిగిన శింగనమల నాయకులు



బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 15: గత వైసీపీ పాలనలో మాదిరే ప్రస్తుతం కొంతమంది భూ కబ్జాలకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సులభంగా డబ్బు సంపాదించడం కోసం అక్రమదారులను ఎంచుకుని బెదిరిస్తున్నట్లు సమాచారం. లేనిదానికి ఉన్నట్లుగా సమస్యను సృష్టించి సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఇందులో అధికార, ప్రతిపక్షాలు మిలాఖత్ కావడం గమనార్హం. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న 73 సెంట్ల ఆయిల్ మిల్ స్థలంపై కబ్జాదారులు కన్నేశారు. ఈ స్థలం అనంతపురం- తాడిపత్రి ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ప్రస్తుతం సెంటు రూ.10లక్షల నుంచి 15 లక్షల వరకు ధర పలుకుతోంది. ఆ స్థలం మొత్తం విలువ ఇప్పుడు రూ.10 కోట్లపైన ఉంది. దాదాపు 20 సంవత్సరాల నుంచి ఆయిల్ మిల్ యజమానుల అనుభవంలో ఉన్న స్థలం మాదే అంటూ శింగనమల నియోజకవర్గానికి చెందిన వైసీపీ, టీడీపీ నేతలు హల్‌చల్ చేసినట్లు సమాచారం. సెటిల్ చేస్కో.. లేక పోతే..! ఈ స్థలంలో కట్టిన ఆయిల్ మిల్, భవనాలు, మొత్తం స్వాధీనం చేసుకుంటాం అని బెదిరింపులకు దిగినట్లు సమాచారం. ఈ స్థలానికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, అసలైన యాజమాని నీవు కాదని, నిజమైన హక్కుదారులతో ఈ స్థలాన్ని కొన్నామని హంగామా సృష్టించినట్లు సమాచారం. నీకు ఈ స్థలంపై ఎలాంటి హక్కు లేదని, సెటిల్ చేసుకోకుంటే లేదంటే ఇబ్బంది పడతావు అంటూ ఆ స్థల యాజమానిని బెదిరిస్తున్నట్లు సమాచారం.

నకిలీ దందాలో వైసీపీ.. టీడీపీ మిలాఖత్...!

ఈ భూ నకిలీ దందా వ్యవహారంలో శింగనమల నియోజకవర్గానికి చెందిన వైసీపీ- టీడీపీ నేతలు మిలాఖత్ అయ్యారు. గత వైసీపీ పాలనలో అనేక భూదందాలు ఈ నియోజకవర్గంలో జరిగిన విషయం తెలిసిందే. గతంలో వైసీపీలో ఉన్న కొంత మంది నాయకులు ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. వారు ప్రస్తుతం ఈ భూ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరికి ప్రస్తుతం ఉన్న కొంత మంది వైసీపీ నాయకులు జతకలిసి విలువైన స్థలాన్ని కాజేయడానికి స్కెచ్ వేశారు. ఈక్రమంలోనే ఈ భూమిని నిజమైన వారుసులమని రంగంలోకి దిగారు. సెటిల్ చేస్కో. లేదంటే ఇబ్బంది పడతావు అంటూ నియోజకవర్గం కేంద్రానికి చెందిన వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన ఓ నాయకులు బెదిరింపులకు దిగినట్లు సమాచారం. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నేతలు ఇలా భూదందాలు చేయడం వలన పార్టీకి చెడ్డపేరు వస్తుందని పలువురు అసలైన టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ దందాలకు పాల్పడే నేతలను పార్టీ నుంచి దూరంగా ఉంచాలని శింగనమల నియోజకవర్గం టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ నాయకులతో మిలాఖత్ అయ్యి ఇలాంటి బెదిరింపులకు దిగడం వలన టీడీపీ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉందనే చర్చ పార్టీలో మొదలైంది.

'మోక్షగుండం' అడుగుజాడల్లో నడుద్దాం



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఈ తదితరులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు15: ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో నడుద్దామని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డు సంపాలత గెస్ట్ హౌస్‌లో ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్పీడీసీఎల్ అనంతపురం సర్కిల్ ఎస్ఈ సంపత్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇంజనీర్లకు జరిగిన అన్యాయంపై కలిసికట్టుగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ టెక్నికల్ ఈఈ ప్రసాద్, గుత్తి డివిజన్ ఈఈ రాజశేఖర్, ట్రాన్స్‌కో ఈఈలు వీరనారాయణరెడ్డి, సంజప్ప పాల్గొన్నారు.

నమ్మితే.. ముంచేశాడు

22 పొదుపు సంఘాల సొమ్ము స్వాహా

- నాలుగేళ్లుగా రూ.72 లక్షలు మాయం
- యానిమేటర్‌దే కీలకపాత్ర !
- చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు మౌనం



కళ్యాణదుర్గం వెలుగు కార్యాలయం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 15: పొదుపు మహిళా సంఘాల సొమ్మును స్వాహా చేస్తూ యానిమేటర్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఎవరికైనా అనుమానం వచ్చి ఆరా తీస్తే బాగోతాలు బయటకు వస్తున్నాయి. తాజాగా కళ్యాణదుర్గంలోని ఓ బ్యాంకులో నిధులు స్వాహా బాగోతం బయటికి వచ్చింది. మండలంలోని మల్లికార్జునపల్లిలో పొదుపు సంఘం మహిళలు తాము తీసుకున్న రుణాలను వాయిదాలపై ప్రతి నెలా చెల్లించేవారు. గతంలో యానిమేటర్‌గా పనిచేసిన ఓ వ్యక్తి ప్రస్తుతం బ్యాంకులో బిజినెస్ సహాయకుడిగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకులోనే పని చేస్తున్నాడనే నమ్మకంతో మహిళలు నెలనెలా కట్టే వాయిదా సొమ్మును అతడికి ఇచ్చి బ్యాంకులో కట్టాలని కోరేవారు. అతను వారిచ్చిన సొమ్మును అప్పులోకి ఏమాత్రం జమ చేయకుండా వడ్డీ మాత్రమే కట్టి మిగిలిని సొమ్మును సొంతానికి వాడుకున్నాడు. ఇలా నాలుగేళ్లుగా గ్రామానికి చెందిన 22 సంఘాల మహిళల సొమ్ము రూ.72 లక్షలు స్వాహా చేశాడు.

తనిఖీలు ఎందుకు చేయలేదో..?

పొదుపు సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణం ఒక్క నెల చెల్లించకపోయినా తేడాలొస్తాయి. ప్రతి నెలా బ్యాంకు లింకేజీ సొమ్ము ఎంత జమైందో మండల సమాఖ్య అకౌంటెంట్ పరిశీలించాలి. సీసీలు, ఏపీఎం పర్యవేక్షించాలి. అయితే నాలుగేళ్ల నుంచి అప్పులోకి పైసా జమ చేయకున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నది పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఈ బ్యాంకులోని 22 సంఘాల సభ్యులు చెల్లించిన రూ.72 లక్షలు స్వాహా చేసినట్లు తేలింది. పర్యవేక్షించాల్సిన అధికారులు కింది స్థాయి వారి మీద తోసేసి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అసలు అధికారులు విచారణే తూతుమంత్రంగా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ డబ్బులన్నీ స్వాహా చేశారని మహిళలే పట్టణంలోని ఆ బ్యాంకు ఎదుటే పెద్ద ఎత్తున ఆందోళన చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. పొదుపు మహిళలు వీరే పాత్రధారులు, సూత్రధారులు అని చెబుతున్నా, అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇకమీదట ఏం చేయాలో తెలియక మహిళలు మిన్నకుండిపోతున్నారు.

ఆరుగురిపై ఫిర్యాదు చేయించాం: మధుసూదన్ గుప్తా, వెలుగు ఏపీఎం

కళ్యాణదుర్గం మండలంలోని మల్లికార్జునపల్లిలో పొదుపు సంఘాలలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆరు గురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేశాం. యానిమేటర్, అకౌంటెంట్, సీసీతో పాటు మరో ముగ్గురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేశాం. బాధ్యులపై కేసులు నమోదు చేయడమే కాకుండా స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేస్తాం. మరో మూడు రోజుల్లో పూర్తి ఆధారాలతో జరిగిన అక్రమాలపై నివేదిస్తాం.

- పొదుపు సంఘాల మహిళల సొమ్ము స్వాహా చేసిన విషయమై ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారించి, నిజమని తేలితే కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అపుస్మా జిల్లా కార్యవర్గం ఎన్నిక



సుబ్బారెడ్డి రవిశంకర్ శ్రీనాథ్

అనంతపురం విద్య, సెప్టెంబరు 15: అపుస్మా జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి, ప్రధానకార్యదర్శిగా రవిశంకర్ ప్రసాద్, జిల్లా కోశాధికారిగా బీవీ శ్రీనాథ్‌ను ఎనుకున్నారు. మాంటిస్సోరి ఎలైట్ స్కూల్‌లో ఆ సంఘం జిల్లా సర్వసభ్యసమావేశం నిర్వహించారు. జిల్లా నూతన కమిటీ ఎన్నిక నేపథ్యంలో కర్నూలు నుంచి వచ్చిన అబ్జర్వర్ శ్రీనివాస్‌రెడ్డి, కర్నూలు ప్రెసిడెంట్ వాసుదేవయ్య కొత్త కమిటీ ఎన్నికలు నిర్వహించారు. నూతన సభ్యులను ప్రకటించారు. కొత్త కమిటీ సభ్యులను అపుస్మా యూనియన్ జిల్లా, రాష్ట్ర నాయకులు, పలువురు ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు అభినందించారు. అంతకు ముందు జరిగిన సర్వసభ్య సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి 400 మంది వరకూ హాజరయ్యారు.



కెవ్వు.. కేక!

జిల్లాలోని అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న దులీప్ ట్రోఫీ క్రికెట్ క్రీడాభిమానులను అలరిస్తోంది. తొలి రౌండ్‌లో లో స్కోరింగ్ మ్యాచ్ కాస్త నిరాశ పరిచినా, రెండో రౌండ్‌లో పరుగుల వరద పారడంతో క్రీడాభిమానులు ఆనందంలో తడిసి ముద్దయ్యారు. బ్యాటర్లు సెంచరీల మోత మోగించడంతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. తెలుగు కుర్రాళ్లు సెంచరీలు సాధించడం పట్ల అనంత క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మ్యాచ్‌లు నాలుగు రోజులు కొనసాగడంతో ఆటను చూడటానికి క్రికెట్ ప్రేమికులు పోటెత్తారు. రెండు మ్యాచ్‌లలో ఒకటి ఫలితం తేలగా, మరొకటి డ్రాగా ముగిసింది.

-7లో..

నెలలోపు కణేకల్లు బ్రిడ్జి నిర్మాణ పనులు

ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా



కణేకల్లు వద్ద బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నయీముల్లా, జిల్లా అధికారులు

కణేకల్లు, సెప్టెంబరు 15: కణేకల్లు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను నెల రోజుల్లోపు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా తెలిపారు. ఆదివారం కణేకల్లు వద్ద ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ కణేకల్లు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ. 48 కోట్లతో ప్రతిపాదనలు పెట్టగా గత ప్రభుత్వంలో టెక్నికల్ కమిటీ, ఫైనాన్స్ కమిటీలు అంగీకరించకపోవడంతో పనులు నిలిచి పోయాయన్నారు. ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవతో ప్రభుత్వంతో చర్చించి అన్ని సమస్యలు క్లియర్ చేయించారని తెలిపారు. మరో నెలరోజుల్లోపు వీటికి సంబంధించి అప్రూవల్స్ అందించి పనులు ప్రారంభిస్తామని, రెండేళ్లలో బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందన్నారు. తద్వారా ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందిపడుతున్న సమస్యకు బ్రేక్ పడుతుందన్నారు. 450 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ప్రస్తుతం ఉన్న హెచ్చెల్సీ అక్విడెక్ట్ కన్నా ఎత్తులో బ్రిడ్జి నిర్మాణం చేస్తామని అన్నారు. స్థల పరిశీలనకు వచ్చిన ఈఎన్‌సీకి స్థానిక మండల టీడీపీ నాయకులు మాబుసాబ్, చాంద్‌బాషా, షేక్‌ముజ్జు, ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో సత్కారం చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబులరెడ్డి, ఈఈ రాజగోపాల్, డీఈ రవిశంకర్‌రెడ్డి, ఏఈ సుజితతో పాటు టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, అనిల్, నాగరాజు, తిప్పేస్వామి, చిన్నసలీం, శేఖర్ పాల్గొన్నారు.

రామసాగరం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

బెళుగుప్ప: మండలంలోని పెన్నానదిపై రామసాగరం సమీపంలో హైలెవెల్ వంతెన బ్రిడ్జిని నిర్మించేందుకు ఆదివారం ఆర్‌అండ్‌బీ ఈఐఎన్‌సీ నయీముల్లా పరిశీలించారు. పీఏబీఆర్ డ్యామ్ నీరు గతంలో ఉన్న బ్రిడ్జిపైకి చేరి మండలం నుంచి అనంతపురానికి రాకపోకలు ఆగిపోయాయి. మండల ప్రజలకు మంత్రి పయ్యావుల కేశవ హామీ నిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా రూ. 90 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి మంజూరుకు చర్యలు తీసుకున్నారు. అనుమతులు రాగానే వేగవంతంగా పనులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

23 వరకు ఈ-పంట నమోదు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15: ఈ ఏడాది ఖరీఫ్ ఈ-పంట నమోదు గడువును ఈనెల 23వతేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఆదివారం వరకే గడువు విధించారు. ఈనెల 23వతేదీలోపు ఈ-పంట నమోదుతోపాటు రైతుల ఈకేవైసీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈనెల 25 నుంచి 27వతేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట వివరాలు ప్రదర్శించడంతో పాటు గ్రామ సభలు నిర్వహించి, సోషల్ ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించారు. 28 నుంచి 29వతేదీ వరకు రైతులతో అర్జీలు స్వీకరిస్తారు. ఈనెల 30న తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 8.88 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇప్పటిదాకా 8.88 లక్షల ఎకరాల్లోనూ (100 శాతం) ఈ పంట నమోదు చేశారు. ఈ-పంట నమోదు వివరాలు సర్వర్‌కు అప్‌లోడ్ చేసిన తర్వాత వీఏఏ అథంటికేషన్ చేస్తారు. ఆ తర్వాత వీఆర్వో అంథంటికేషన్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి దాకా రైతు సేవా కేంద్రం సిబ్బంది 8.62 లక్షల ఎకరాలకు అంథంటికేషన్ చేశారు. ఇందులో 8.37 లక్షల ఎకరాలకు వీఆర్వోలు అంథంటికేషన్ పూర్తయింది. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వో అథంటికేషన్ తర్వాత రైతుతో ఈకేవైసీ చేయిస్తేనే ఈ-పంట పూర్తవుతుంది. ఇప్పటిదాకా 3.30 లక్షల మంది రైతులతో ఈకేవైసీ వేయించారు. గడువులోగా రైతులతో ఈకేవైసీని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎన్‌ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15: ఏపీఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పీవీకేకే కళాశాలలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం హయాం నుంచి నిలిపివేసిన నైట్ అవుట్, ఓటీ అలవెన్సులను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్నిరకాల అరియర్స్, సిక్ లీవుల జీతాలు, ఇంక్రిమెంట్ల అరియర్స్, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్‌ను ట్రెజరీశాఖ అధికారులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రిస్వామి, కార్యదర్శి నాగరాజు, జిల్లా చైర్మన్ సూరిబాబు, కార్యదర్శి ప్రతాప్ నారాయణ, సలహాదారులు ఆదినారాయణ, పుల్లయ్య, డీఎస్ రెడ్డి, సీవీపీ సదాశివరెడ్డి, సంయుక్త కార్యదర్శి అనిత, మనోజ్‌కుమార్, మద్దిలేటి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఏరువాక కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 15 : జిల్లాలో వేరుశనగపంటను సాగుచేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రస్తుతం వేరుశనగపంట కాయ అభివృద్ధి దశలో ఉందన్నారు. వేరుశనగకు మచ్చతెగులు ఆశించినదని దీని నివారణకు ఎక్సకోనజోన్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే కందిపంట 65 రోజులకు ప్రొపినోపాస్ రెండు మిల్లీలీటర్లు లేదా ఓమైట్ ఒక మిల్లీలీటరును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నపంట విత్తనం కంకి ఏర్పడే దశలో ఉందన్నారు. 60 రోజులకు యూరియా 50కిలోలు, 25కిలోలు పొటాష్ ఎరువులను వాడుకోవాలని సూచించారు. వరి పిలకల దశలో ఉందని, పైపాటుగా యూరియా 50కిలోలు ఎకరానికి వాడుకోవాలన్నారు. వరిని నల్లి ఆశించందని దీని నివారణకు ప్రొఫైనోపాస్ 2 మిల్లీలీటర్లు లేదా ఓమైట్ ఒక మిల్లీలీటరును లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.

డీఎస్పీల నియామకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో పలు సబ్ డివిజన్లకు డీఎస్పీలను నియమించారు. గత నెలలో డీఎస్పీలను బదిలీ చేసినా వారి స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. ఆదివారం జరిగిన బదిలీల్లో ఉమ్మడి జిల్లాల పరిధిలో కొందరు డీఎస్పీలను నియమించారు. అనంతపురం డీఎస్పీగా సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న వల్లూరి శ్రీనివాసరావును నియమించారు. అనంతపురం రూరల్ డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న టి.వెంకటేశ్వర్లు, గుంతకల్లు డీఎస్పీగా కందుకూరు డీఎస్పీ ఆముడ్ల శ్రీనివాసులు, తాడిపత్రి డీఎస్పీగా ఇంటిలెజిలెన్స్‌లో పనిచేస్తున్న పి.రామకృష్ణుడు, అనంతపురం మహిళా పీఎస్ డీఎస్పీగా ఎస్.మహబూబ్‌బాషా, డీపీటీసీ డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న శరత్‌రాజ్‌కుమార్, కదిరి డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న జె.శివనారాయణ స్వామి, అనంతపురం 14వ బెటాలియన్, ఏపీఎస్పీ డీఎస్పీగా బి.సునీల్‌ను నియమించారు.

బంజారాల బ్రహ్మోత్సవం తీజ్

- గిరిజనుల సంప్రదాయ పండుగ
- తండాలకు తరలిరానున్న గిరిజనులు
- నేటి నుంచి 26వరకు ఉత్సవాలు

ఉరవకొండ, సెప్టెంబరు 15: బంజారాలు తమ సంప్రదాయ పండుగను తీజ్‌ను శతాబ్దాల నుంచే చేసుకుంటున్నారు. దీనిని బంజారాల బ్రహ్మోత్సవాలుగా పిలుస్తారు. ఈ పండుగ అంటే బంజారా యువతులు, మహిళలకు ఎంతో ఇష్టం. ఈ సంప్రదాయ ఉత్సవాల పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని బంజారాలు కోరుతున్నారు. బంజారాల బతుకమ్మ పండుగగా చెప్పుకునే తీజ్ గిరిజనులకు పెద్ద ఉత్సవం. ప్రతి ఏటా భాద్రపద మాసంలో 11 రోజుల పాటు తీజ్ ఉత్సవాలు ఘనంగా చేసుకుంటారు. ఈ నెల 16నుంచి 26 తేదీ వరకూ తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉరవకొండ మండలంలోని వెంకటాంపల్లి పెద్దతండా, చిన్నతండాల్లో ఉత్సవాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



తీజ్ ఉత్సవాల్లో భాగంగా వెదురుబుట్టల్లో గోధుమలు నాటిన దృశ్యం (ఫైల్)



నృత్యం చేస్తున్న మహిళలు (ఫైల్)

ఉత్సవాలు ఇలా...

బంజారాల తీజ్‌కు తెలంగాణ బతుకమ్మ పండుగకు చాలా పోలికలు ఉన్నాయి. బతుకమ్మ పండుగ తరహాలోనే బంజారాలు ప్రత్యేకంగా అల్లిన వెదురు బుట్టల్లో సేంద్రియ ఎరువులు, పుట్టమన్ను, ఇసుక తీసుకువస్తారు. వీటిన్నంటినీ కలిపి వెదురుబుట్టలో వేసి గోధుమ గింజలు నాటుతారు. వేసిన నాటి నుంచి యువతులు క్రమంతప్పకుండా ఉదయం సాయంత్రం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి వెదురు గంపలలోకి నీటిని పోస్తారు. ఇలా 11రోజులుపాటు వేస్తారు. బుట్టలన్నింటినీ గురునానక్ దేవాలయం వద్ద ఉంచి పొలాల్లోని తంగేడు, గరుగు, జాజి మల్లెలు తదితర పుష్పాలను వరుస క్రమంలో అమర్చుతారు. మధ్యలో గోధుమ మొక్కలు కనిపించేలా తయారు చేసుకుంటారు. బంజారాల సంప్రాదాయం ప్రకారం నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ పండుగ నిర్వహిస్తారు. యువతులు ఇలా చేస్తే మంచి వరుడు దొరుకుతాడని వారి నమ్మకం. మహిళలు ఇలా చేస్తే వారి దాంపత్య జీవితం సిరిసంపదలు, పిల్లాపాపలతో సంతోషంగా గడుపుతారని విశ్వాసం. మహిళలు కులదైవాలను స్మరించుకుంటూ సేవాలాల్ దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఏటా సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని దేవతలను ఆరాధిస్తారు.

తీజ్ ఎంతో ప్రత్యేకం

ప్రతి ఏటా ఖరీఫ్ విత్తనం వేసిన తర్వాత భాద్రపద మాసంలో 11రోజుల పాటు తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తారు. తండా వాసులు సంచారం కోసం ఎక్కడికెళ్లినా తీజ్ ఉత్సవాలకు సొంత గ్రామాలకు వస్తారు. తీజ్ ఉత్సవంలో బంజారాలో ఉన్న గోత్రాల ప్రకారం 52 వెదురు బుట్టలను ఏర్పాటు చేస్తారు. గురునానక్ దేవాలయం వద్ద తీజ్ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. గురునానక్ దేవాలయంలో వారం రోజుల క్రితం మొలక కట్టిన గోధుమలకు పూజలు నిర్వహించి బయటకు తీస్తారు. మొలకలు ఉన్న గంపలను ఆలయ ప్రాంగణంలో తీజ్ ఆకారంలో ఉంచి పూజలు చేస్తారు. యువతులు సంప్రదాయ వేషధారణ అందరినీ ఆకట్టుకుంటుంది.

ప్రభుత్వమే నిర్వహించాలి



బంజారాల సంప్రదాయం కనుమరుగు కాకుండా చూడాల్సి బాధ్యత యువతపై ఉంది. తీజ్ పండుగను ప్రభుత్వమే నిర్వహించాలి. పండుగ విశిష్టతపై విస్తృత ప్రచారం జరగాలి. తీజ్‌లో పాల్గొనడం గర్వంగా ఉంది. ఈ పండుగంటే ఎంతో ఇష్టం.

- కల్పనాబాయి, పారామెడికల్ విద్యార్థిని

ఐక్యతకు ప్రతీక



తీజ్ పండుగ ఐక్యతకు ప్రతీక. కనుమరుగు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పండుగ కోసం తండాకు వచ్చాం. బందుల మధ్య పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉంది.

- తేజస్విని, విద్యార్థిని



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రామస్థులు



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ములాని



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న అన్షుల్ కాంబోజ్

ఆట అదుర్స్..!

- అభిమానులతో కిటకిటలాడిన ఏసీజీ
- ఇండియా- డిపై ఇండియా-ఎ విజయం
- రికీ భుయ్ వీరోచిత శతకం వృథా
- డ్రాగా ముగిసిన ఇండియా- బి, ఇండియా- సి మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15: ఊహించినట్లుగా ఇండియా-ఏ జట్టు భారీ విజయం సాధించింది. ఇండియా-బి, ఇండియా- సి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానిక అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రౌండ్ దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఓవర్‌నైట్ స్కోర్ 62/1తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-డి లక్ష్య ఛేదనలో విఫలమైంది. తెలుగుతేజం రికీ భుయ్ వీరోచిత (113) సెంచరీతో ఆకట్టుకున్నా తన జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయాడు. చివరి రోజు 426పరుగులు సాధించాల్సి ఉండగా ఇండియా-డి 82.2ఓవర్లలో 301పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 41, యశ్ దుబే 37, సంజు శ్యాంసన్ 40 పరవాలేద నిపించగా మిగతా బ్యాటర్లు విఫలమవడంతో పరాజయం తప్పలేదు. దీంతో ఇండియా ఏ జట్టు 186పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇండియా ఏ బౌలర్లు తనుష్ కొటియాన్ 4వికెట్లు, షాంశ్‌ములానీ 3, ఖలీల్‌అహ్మద్, రియాన్ పరాగ్‌లో చెరో వికెట్ పడగొట్టారు. ఇండియా ఆల్‌రౌండర్ షాంశ్‌ములానీ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా- ఏ జట్టులో తిలక్‌వర్మ, ప్రథమ్‌సింగ్ సెంచరీలు సాధించారు. ఇండియా-డి జట్టులో రిక్కీభూయ్ సెంచరీ సాధించాడు.

డ్రాగా ముగిసిన ఇండియా బి, ఇండియా సి మ్యాచ్

దులీప్‌ట్రోఫీలో భాగంగా ఇండియా-బి, ఇండియా- సి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో ఇండియా- సి మొదటి ఇన్నింగ్స్‌లో 525 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా-బి మొదటి ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌట్ అయ్యిం ది. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా-సి జట్టు చివరి రోజు 37ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 124 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 62, రజిత్ పటిదార్ 42 రాణించారు. రాహుల్ చాహర్ 2, ముకేష్‌కుమార్, ముషీర్‌ఖాన్‌లు చెరో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా- సి బ్యాటర్ ఇషాన్ కిషాన్, ఇండియా- బి కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ శతాకాలతో మెరిశారు. చివరి రోజు కావడం, ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇండియా- బి రెండో ఇన్నింగ్స్ ఆరంభించకనే అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఆల్‌రౌండర్ అన్షుల్‌కాంబోజ్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచారు.

స్కోరు వివరాలు

ఇండియా-ఎ
మొదటి ఇన్నింగ్స్- 290పరుగులకు ఆలౌట్
రెండో ఇన్నింగ్స్- 380/3 డిక్లేర్డ్
ఇండియా-డి
మొదటి ఇన్నింగ్స్- 183 ఆలౌట్
రెండో ఇన్నింగ్స్- 301 ఆలౌట్.
ఫలితం: 186 పరుగుల తేడాతో ఇండియా-ఎ విజయం

స్కోరు వివరాలు

ఇండియా- సి
మొదటి ఇన్నింగ్స్ 525 పరుగులకు ఆలౌట్
రెండో ఇన్నింగ్స్ 124/4 డిక్లేర్
ఇండియా- బి
మొదటి ఇన్నింగ్స్- 332 పరుగులకు ఆలౌట్
రెండో ఇన్నింగ్స్- ఆరంభించలేదు
ఫలితం- మ్యాచ్ డ్రా



డ్రమ్స్ మోత

ఉమ్మడి జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణం

ఉమ్మడి జిల్లాలో స్టేడియం నిర్మించి, ఆంధ్రాక్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తామని ఏసీఏ మౌలిక వసతుల కల్పన కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. దులీప్‌ట్రోఫీని రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం నిర్వహించడం శుభపరిణామమన్నారు. రాయలసీమ క్రీడాకారులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేలా తీర్చి దిద్దుతామన్నారు.

కిటకిటలాడిన స్టేడియం

తొలిమ్యాచ్ మాదిరి మూడు రోజులకే ముగియకుండా నాలుగు రోజుల పాటు ఆట కొనసాగడం, చివరి రోజు ఆదివారం కావడంతో ఆర్డీటీ స్టేడియం ప్రేక్షకులతో కిటకిటలాడింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు స్టేడియానికి తరలివచ్చారు. ఈలలు, కే రింతలతో ఆటగాళ్లను ప్రోత్సహించా రు. నగర ప్రజలు, జిల్లాలోని క్రీడాభిమానులు స్టేడియానికి తరలి వచ్చి ఆనందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రో గ్రాం డైరెక్టర్ మాం చోపెర్రర్, బీసీసీఐ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అసమానతలు తొలగితేనే సమగ్రాభివృద్ధి

జేవీవీ మహాసభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15: ప్రాంతీయ అసమానతలు తొలగితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ లక్ష్మణరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జేవీవీ వార్షిక రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వాల లెక్కల ప్రకారం అభివృద్ధి అంటే జీడీపీ, తలసరి ఆదాయం వంటి ఆర్థికపరమైన అంశాలే అన్నారు. మానవ వనరులు అభివృద్ధి చెందినపుడే అభివృద్ధి అని పేర్కొన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి లభించినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదని, రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడి ఉన్నాయని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. జేవీవీ రాష్ట్ర నాయకుడు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మన సమాజంలో అశాస్త్రీయమైన భావాలను అనేక ఏళ్లుగా అందరి మెదళ్లలో నాటి ఉన్నారని, వీటిని తొలగించే ప్రయత్నం చేయాలంటే సైన్సు ప్రచారాన్ని విస్తృతం చేయాలన్నారు. ప్రధానంగా యువత మరింతగా పనిచేయాల్సిన అవసరముందని, వారిని చైతన్యపరిస్తే సమాజం అభివృద్ధి వైపు పయనిస్తుందని వివరించారు. ఇపుడున్న అశాస్త్రీయ భావాల ప్రభావమే యువతపై ఎక్కువగా ఉందన్నారు. దీనిని అధిగమించేందుకు జేవీవీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు, కార్డియాలజిస్టు వంశీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు డాక్టర్ ప్రసూన, గంగేనాయక్, మహ్మద్ జిలాని, నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, వీర్రాజు, నాయకులు రామకృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండురోజులు సుదీర్ఘ చర్చలు

జన విజ్ఞాన వేదిక మహాసభల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జేవీవీ నాయకులు, కార్యకర్తలు రెండురోజులపాటు సుదీర్ఘ చర్చలు జరిపారు. ఇందులో ఈ రెండేళ్ల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను ఆయా ప్రాంతాలవారీగా వివరించారు. అదేవిధంగా ఇపుడున్న పరిస్థితుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడానికి చేయాల్సిన పనులపైనా చర్చించారు. ప్రధానంగా యువతలో శాస్త్రీయ భావాల పెంపుదలకు కృషిచేయడంపై దృష్టి సారించాలని మహాసభల్లో చర్చించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 15 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 932 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 50 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

20 నుంచి క్రీడాపోటీలు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 15: జిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి అండర్-14, 17 విభాగానికి సంబంధించి క్రీడాపోటీలు మండలంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు లింగానాయక్, నవీదా తెలిపారు. బుక్కరాయసముద్రం ఆర్డీటీ మైదానం, సిద్దరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్ ఈ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.33

అనంతపురంరూరల్, సెప్టెంబరు 15: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.25, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

పెరిగిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో పశువుల సంత ఆదాయం ఈ వారం పెరిగింది. బుధవారం మాలపౌర్ణమి కావడంతో. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతతో మార్కెట్ కమిటీకి రూ.2,67,725 ఆదాయం వచ్చింది. అలాగే ఆదివారం ఆవులు, గేదెల సంతతో రూ.1,62,350 ఆదాయం వచ్చింది. రెండురోజుల సంతతో రూ.4,30,075 సమకూరినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ కోచ్‌కు అరుదైన గుర్తింపు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15: జిల్లాకు చెందిన అథ్లెటిక్ కోచ్ సురేష్‌కుమార్‌కు అరుదైన గుర్తింపు లభించింది. ఆగస్టు 28వతేదీ నుంచి సెప్టెంబరు 8వతేదీ వరకు పారిస్‌లో నిర్వహించిన పారా ఒలంపిక్స్‌లో జిల్లాకు చెందిన అథ్లెటిక్ కోచ్ సురేష్‌కుమార్ భారత జట్టు కోచ్‌గా వ్యవహరించారు. ఇందులో భారత్‌కు 7 బంగారు, 9 వెండి, 13 కాంస్య పతకాలు సాధించారు. భారత కోచ్‌గా వ్యవహరించిన సురేష్‌కుమార్‌ను ఇటీవల ఢిల్లీలోని నివాసంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు. ఈ విషయాన్ని కోచ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.



ప్రధాని మోదీని కలిసిన వారిలో జిల్లా అథ్లెటిక్స్ కోచ్ సురేష్‌కుమార్

పంచాయతీకి పన్ను ఎగనామం..!

● మూడేళ్ల నుంచి చెల్లించని మెకానిక్ షాపుల నిర్వాహకులు

రాప్తాడు, సెప్టెంబరు 15: ఆటో నగర్ మెకానిక్ షాపుల యజమానులు రాప్తాడు గ్రామ పంచాయతీకి పన్ను చెల్లించడం లేదు. ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారు. పన్ను వసూలు చేయాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. ఇదిగో చేస్తాం. అదిగో చేస్తాం అంటూ జాప్యం చేస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీ భారీగా నష్టపోతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటూ పొరుగు జిల్లాల్లోని వాహనదారులు రాప్తాడు సమీపంలో ఏర్పాటైన ఆటో నగర్‌లో వచ్చి వాహనాలను రిపేరీ చేయించుకుని వెళ్తారు. ఆటో నగర్ 2010లో రాప్తాడులో ఏర్పాటయింది. ఏపీఐఐసీ సంస్థ సర్వే నెంబర్ 554-2లో 33 ఎకరాల దేవదాయశాఖ భూమిని లీజుకు తీసుకుంది. ఆ భూమిని సబ్ లీజుకు ఆటో నగర్‌కు కేటాయించారు. ఏపీఐఐసీ నిబంధనల ప్రకారం రాప్తాడులో ఆటోనగర్ ఏర్పాటు చేశారు. గతంలో అనంతపురంలో వాహనాల రిపేరీ షాపులు ఉండటం వలన ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు నగరానికి దూరంగా మెకానిక్ షాపులు ఉండాలని రాప్తాడులో ఆటో నగర్ ఏర్పాటు చేశారు. దాదాపు 375 మెకానిక్ షాపులు ఏర్పాటు చేశారు. ఇక్కడ షాపులు నిర్వహిస్తున్న మెకానిక్‌లు అందరూ (33 ఎకరాలకు) ఏపీఐఐసీకి ఏడాదికి లీజు మొత్తం రూ.7 లక్షలు చెల్లించాలి. ప్రతి ఏడాది లీజు మొత్తం చెల్లించడంతో పాటు గ్రామ పంచాయతీకి కూడా ఏడాదికి ఒక సారి పన్ను, లైసెన్స్ ఫీజు చెల్లించాలి. పంచాయతీ అధికారుల లెక్కల ప్రకారం మెకానిక్ షాపు విస్తీర్ణం బట్టి ఒక్కో షాపుకు ఏడాదికి రూ.600 నుంచి వెయ్యి వరకు చెల్లించాల్సి ఉంది. మూడేళ్ల నుంచి మెకానిక్ నిర్వాహకులు పంచాయతీకి పన్ను చెల్లించలేదు. మొత్తం 370కిపైగా షాపులు ఉన్నాయి. ఏడాదికి దాదాపుగా రూ.2 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. ఆ లెక్క మూడేళ్లకు 6 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది. 375 మెకానిక్ షాపుల్లో కేవలం 20 లేదా 30 మంది మాత్రమే ప్రతి ఏడాది పన్ను చెల్లిస్తున్నారు. మిగతా వారు చెల్లించలేదు. దీంతో పంచాయతీ భారీగా నష్టపోతోంది. దీనిపై ఆటోనగర్ అధ్యక్షుడు షామీర్ బాషాను వివరణ కోరగా పంచాయతీకి పన్ను చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా... ఇటీవలే పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శిగా వచ్చానని ఇప్పటి నుంచి సక్రమంగా పన్ను వసూలు చేస్తామన్నారు.


రాప్తాడు ఆటో నగర్

నేడు మిలాద్-ఉన్-నబీ

● ముస్తాబైన దర్గాలు, మసీదులు


విద్యుద్దీపాలంకరణలో నగరంలోని మసీదులు



అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15 : ప్రపంచశాంతి విశ్వశాంతి, సమాజశ్రేయస్సుకోసం పరితపించిన మహమ్మద్ ప్రవక్త జయంతిని ముస్లింలు 'మిలాద్-ఉన్-నబీ' పండుగగా జరుపుకుంటారు. మిలాద్-ఉన్-నబీ వేడుకలను సోమవారం జరుపుకొనేందుకు జిల్లావ్యాప్తంగా మసీదులు, దర్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఉదయం 'జులుసే మహ్మదీయా' పేరు తో శాంతిర్యాలీలు, మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం మహమ్మద్ ప్రవక్త కేశాన్ని దర్శనం జరుపుకోనున్నారు ముస్లీం సోదరులు. పండుగను పురస్కరించుకుని మసీదులు, దర్గాలు విద్యుద్దీపాలంకరణల్లో ఆకట్టుకుంటున్నాయి.

సర్వ మానవాళికి ఆదర్శం మహ్మద్ ప్రవక్త



సమాజ శ్రేయస్సును కాంక్షించే బోధనలతో మహ్మద్ ప్రవక్త సర్వమానవాళికి ఆదర్శంగా నిలిచారు. ప్రవక్త బోధనల సారాంశాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలి. కులమతాలకు అతీతంగా ప్రవక్త ఆశీస్సులు అన్ని వర్గాలవారికి అందాలనే ఉద్దేశంతో ప్రతియేటా మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త పవిత్ర కేశదర్శనం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. - **కేఎం షకీల్ షఫి, ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

ముస్లింలకు ఎమ్మెల్యే మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15: ముస్లింలకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మిలాద్ -ఉన్- నబీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ శాంతి స్థాపన కోసం అల్లా మహ్మద్‌ను చివరి ప్రవర్తగా నియమించారని ముస్లింలు భావిస్తారని, ఆయన జయంతి విలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ర్యాలీలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రేపు అనంత పద్మనాభస్వామి వ్రతం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15: హెచ్చెల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి దేవత కొలువైన వలి స్వామి ఆశ్ర మంలో మంగళవారం అనంత పద్మనాభస్వామి వ్రతం నిర్వహించ నున్నట్లు ఆశ్రమ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా రద్దు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈనెల 23న నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు

అనంతపురం క్రైం: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు, క్రయ విక్రయదారులకు అందుబాటులో ఉండేలా మార్పులు చేయనున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో సబ్‌రిజిస్ట్రార్ పోస్టు కీలకం. అయితే ఇదివరకు సబ్ రిజిస్ట్రార్ కూర్చునే సీటు హైట్‌లో ఉండేది. ఎదురుగా కూర్చోవడానికి సైతం ఉండేదికాదు. ఎదుట గ్లాస్ ఫిటింగ్ ఉండేది. తాజా మార్పులతో ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాలు మార్చనున్నారు. ఈ మార్పులో ప్రత్యేకంగా చాంబర్ వద్దని ఆ శాఖవర్గాలు చెబుతున్నాయి.

వరద బాధితులకు ఎంపీ అంబికా సాయం


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు తన కుమారుడు అంబికా వీక్షిత్‌తో కలిసి ఆదివారం హైదరాబాద్‌లో సీఎం చంద్రబాబునాయుడుకు రూ.2,01,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీని సీఎం అభినందించారు. వరద బాధితులకు తన వంతుగా ఆర్థిక సాయం చేశానని ఎంపీ తెలిపారు. ప్రభుత్వం వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన అన్నారు.

రామగోవింద్‌సాగర్‌కు జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రామగోవింద్ సాగర్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15 : లలితకళా పరిషత్‌కు చెందిన పౌరాణిక నాటక కళాకారుడు రామగోవింద్‌సాగర్ కళాభూషణ్ జాతీయ పురస్కారం అందుకున్నారు. బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బళ్లారిలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయస్థాయిలో వివిధ రంగాలకు చెందిన పలువురికి పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా పౌరాణిక నాటకాల్లో రాణిస్తున్న రామగోవింద్‌సాగర్‌కు కళాభూషణ్ జాతీయస్థాయి పురస్కారాన్ని అసోసియేషన్ నిర్వాహకులు అందజేసి సత్కరించారు.

ఆచార్య సుధాకర్‌బాబుకు 'తెలుగు వెలుగు' జాతీయ నంది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ఆచార్య సుధాకర్‌బాబు

అనంతపురం కల్చరల్ : ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ బాబుకు 'తెలుగు వెలుగు' జాతీయ నంది పురస్కారం అందుకున్నారు. గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కళా, సాంస్కృతిక, సాహిత్య రంగాలకు చెందిన పలువురిని తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సాంస్కృతిక విభాగంలో ఆచార్య సుధాకర్‌బాబుకు ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో తెలుగు వెలుగు సాహితీవేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, నాసా మాజీ శాస్త్రవేత్త సాంబశివరావు చేతులమీదుగా పురస్కారం అందజేసి సత్కరించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

రామగిరి, సెప్టెంబరు 15: శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండల వాసి శాంతల 45 రోజులుగా కనిపించలేదని భర్త సోమశేఖర్ రామగిరి పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. శాంతల జూలై 24న రామగిరి అగ్రికల్చర్ కళాశాలలో డిప్లొమా సర్టిఫికెట్ తెచ్చుకుంటానని వచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ రోజు నుంచి ఆమెకోసం పలు ప్రాంతాల లో వెతికామని ఎక్కడా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్టు భర్త తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

నగరంలో యువతి...

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15 : నగరంలో ఓ యువతి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. రాణీనగర్‌కు చెందిన గౌస్య నగరంలోని ఓ బట్టలషాపులో పనిచేసేది. గతనెల 3వ తేదీన ఆ యువతి కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరాతీశారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో వారు ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనంతపురం క్రైం: నగరంలోని ఐదో రోడ్డుకు చెందిన విజయ్ కుమార్(23) కారుడ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. తన మేనమామ కుమార్తెను ప్రేమించాడు. ఇందుకు మేనమామ సమ్మతించలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 13న గుత్తిరోడ్డు సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్, ఆటో ఢీ- ఒకరికి తీవ్రగాయాలు

గార్లదిన్నె, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని కనుంపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదం లో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన దూదేకుల పీరా తిమ్మంపేట నుంచి కాకరకాయలను ఆటో వేసుకుని కనుంపల్లి వైపు వెళుతున్నాడు. అనంతపురం పట్టణంలోని రామయ్య కాలనీకి చెందిన మహమూబుబ్‌బాషా పామిడి నుంచి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా కాకరకాయల ఆటో కనుంపల్లి సమీపంలో ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న మహబుబ్‌బాషాకు కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటోని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ పీరాను అదుపు లోకి తీసుకున్నట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15: ఆంధ్రావాళ్లు హైదరాబాద్‌కు బతకడానికి వచ్చినోళ్లు అని, తిరిగి కేసీఆర్ వస్తే సీమాంధ్రులను తరిమికొడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ పేర్కొన్నారు. వెంటనే ఆ మాటలు వెనక్కు తీసుకుని ఏపీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు రావడానికి ఆంధ్రావాళ్లు ఓట్లు వేయడం వల్లనే అనే సంగతి గుర్తుంచుకోవాలని కౌశిక్‌రెడ్డికి సూచించారు. ఓట్లుకోసమే ఆంధ్రావాళ్లను వాడుకుంటున్న బీఆర్ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. రెండు ప్రాంతాల ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డి శాసనసభ్యత్వం రద్దు చేసి, పార్టీనుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం'

అనంతపురంరూరల్, సెప్టెంబరు 15: ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలందరూ భాగస్వాములుకావాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మంచాల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్ అధ్యక్షతన స్థానిక వీపీకేకే డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల ఫలితాల సరళనే ప్రజాస్వామ్యంగా ప్రజలు భావిస్తున్నారన్నారు. ప్రస్తుతం బలవంతులు చట్టాల్ని తమ చేతిలోకి తీసుకొని పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లానాయకులు టివిరెడ్డి, సుబ్బరాయుడు, రమణారెడ్డి, రామలింగయ్య, నగర కమిటీ నాయకులు ఓబులపతి, రామకృష్ణ, మంజునాథ్, రూరల్ కమిటీ నాయకులు సంగాపణిభూషణ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పండమేరు వంకపై రోడ్డు మరమ్మతులు

● టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి

రాప్తాడు, సెప్టెంబరు 15: ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు... రాప్తాడు నుంచి చిన్మయ్‌నగర్‌కు పండమేరు వంక మీదుగా వెళ్లే రోడ్డు మరమ్మతులు త్వరలో చేపడుతామని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. ఆయన ఆదివారం పండమేరు వద్ద రోడ్డుపై నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, తెలుగుయువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్‌బాబు


నియామకపత్రం అందుకుంటున్న భాస్కర్‌బాబు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు15 : బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడి గా భా స్కర్ బా బు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ నాగభూషణం భాస్కర్‌బాబుకు నియామక పత్రా న్ని అందజేశారు. బీసీల హక్కు ల కోసం పోరాటాలు చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు


గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15: మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం సాయినగర్‌లో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ తన నివాసం నుంచి ముసింలతో కలిసి సూర్యనగర్ 80 అడుగుల రోడ్డు, పాతూరులలో గంధం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పామిడి దర్గాకు తీసుకెళ్లి గంధం సమర్పించారు. మధ్యాహ్నం దాదాపు రెండు వేల మందికి అన్నదాన వినియోగం చేశారు. ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, నాయకుడు పరిటాల శ్రీరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, నాయకులు తాజుద్దీన్, లక్ష్మీనారాయణ, ఎన్‌బీకే ఫ్యాన్స్, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాల వారీగా ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులివ్వాలి: ఎన్టీఏ

అనంతపురం విద్య, సెప్టెంబరు 15 : ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు ప్రభుత్వం కృషి చేయాలని, అప్పటి వరకు యాజమాన్యాల వారీగా ఉద్యోగోన్నతులు కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జడ్పీ ఉపాధ్యాయులకు అన్యాయం చేసేందుకు కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ఆరోపించారు. జడ్పీ మేనేజ్‌మెంట్ ఎంఈఓలను తప్పించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. స్థానిక సంస్థల ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు రాకుండా గండికొడుతున్నారన్నారు. కావున ఏకకృత సర్వీసు రూల్స్ వచ్చే వరకూ యాజమాన్యాల వారీగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

శిక్షణకు వెళ్లనున్న ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు15: కెపాసిటీ ఆఫ్ బిల్డింగ్ శిక్షణకోసం జిల్లా నుంచి పలువురు ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయితీ కార్యదర్శులు సోమవారం శ్రీకాళహస్తికి వెళ్లనున్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు ఉమ్మడి జిల్లా నుంచి పది మంది ఎంపీడీఓలతో పాటు అనంతపురం జిల్లా నుంచి ఐదుగురు ఈఓఆర్డీలు, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేసినట్లు డీపీఓ ప్రభాకర్‌రావు తెలిపారు. ఎంపీడీఓలు పుల్లయ్య, తేజోత్స్న సలోమాన్, రామచంద్ర, రంగారావ్, మనోహర్, నరేష్‌క్రిష్ణ, నాగేంద్రకుమార్, విజయలక్ష్మి, కొండన్న, ఈఓఆర్డీలు వెంకటేష్, సదాశివ, మురళీక్రిష్ణ, బోడేన్న, నాగభూషణ, కార్యదర్శులు సాధిక్‌వలి, ప్రసాద్, రామక్రిష్ణ, బాబాఫక్రుద్దీన్ తదితరులు వెళ్లనున్నారు. భవన నిర్మాణ అనుమతుల మంజూరుకు సంబంధించి శిక్షణ ఇస్తారని డీపీఓ తెలిపారు.

తొగటవీర క్షత్రియ సంఘం వ్యవస్థాపకుడి మృతి


బండి పార్థసారథి (ఫైల్)

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15 : తొగటవీర క్షత్రియ సంఘం వ్యవస్థాపకుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు బండి పార్థసారథి ఆదివారం విజయనగర కాలనీలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆ సంఘం నాయకులు పార్థసారథి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

నార్పల, సెప్టెంబరు15: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1997-98సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణంలో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అప్పటి ఉపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, బేగం, పార్వతి, నాగలక్ష్మి, వెంకటస్వామి, భయపరెడ్డి, నారాయణను పూర్వ విద్యార్థులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుని సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారిని అదుకోవాలని నిర్ణయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో పూర్వ విద్యార్థులు గాండ్ల సురేష్, నాగరాజు, డిపో రసూలిల్లా, దస్తగిరి, శ్రీధర్, షేక్షావలి, లయన్‌పటాన్, రసూల్‌ఖాన్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పాఠశాలలో కలిసిన పూర్వవిద్యార్థులు

సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15: సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ రీ ఆర్గనైజేషన్ వ్యవహారంలో ప్రభుత్వం సమగ్రంగా చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లాలన్నారు. సీఆర్‌పీలు ఎవరూ ఆందోళన చెందవద్దని, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అండగా ఉంటారన్నారు. అగ్రిమెంట్ బాండ్ విధానం రద్దుకోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలన్నారు. చిరుద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే హెచ్ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరైంది కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యో గుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు, సభ్యులు రామన్న, నాగరాజు, జిల్లా నాయకులు సురేష్‌వర్మ, నాగరాజు, మాధవ్, శంకరయ్య, నరసింహమూర్తి, నూర్‌మహ్మద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం

ఇంజనీర్ల తయారీకేంద్రంగా ఇండియా: జేఎన్‌టీయూ వీసీ


మోక్షగుండం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ సుదర్శన రావు తదితరులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 15: ఇంజనీర్ల తయారీ కేంద్రంగా ప్రపంచదేశాలను ఇండియా అధిగమిస్తోందని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు పేర్కొన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆదివారం జేఎన్‌టీయూలో ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విగ్రహానికి వీసీ సుదర్శన రావు తదితరులు నివాళులర్పించారు. ఓస్‌డీటూ వీసీ దేవన్న, డైరెక్టర్లు సత్య నారాయణ, వైశాలి గోర్పాడే, ప్రశాంతి, సుజాత, ఈశ్వర్‌రెడ్డి, సురేషబాబు, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీఈ శివలింగ రావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు మోక్షగుండం: ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ


నివాళులర్పిస్తున్న ఈఎన్‌సీ నయీముల్లా, అధికారులు, సిబ్బంది

అనంతపురం సిటి, సెప్టెంబరు15: మనిషి మేధస్సుకు శాస్త్రీయత తోడైతే మహా అద్భుతాలు సృష్టించవచ్చునని నిరూపించిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా కొనియాడారు. స్థానిక అర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఎస్ఈ హరిప్రసాద్, ఈఈలు ప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్, పలువురు డీఈఈలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మోక్షగుండం అదర్శప్రాయుడు: హౌసింగ్ పీడీ


మొమెంటోలను అందజేస్తున్న పీడీ శైలజ

అనంతపురం సిటీ: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ పనిచేయాలని హౌసింగ్ పీడీ శైలజ సూచించారు. స్థానిక హౌసింగ్ శాఖ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పలువురు అధికారులను శాలువాతో సత్కరించి మొమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో డీఈఈలు లక్ష్మీనారాయణమ్మ, క్రిష్ణారావు, దేవరకొండ రామ్మూర్తి, షాషావలి, హనుమప్ప, రంగసప్వామి, ఏఈలు జమీల్‌అహ్మద్, శివారెడ్డి, శ్రీనివాసులు, మేనేజర్ అల్తాప్‌హుసేన్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ విభాగంలో...


నివాళులర్పిస్తున్న డీఈఈ లక్ష్మీనారాయణ తదితరులు

అనంతపురం సిటీ: నగరంలోని స్థానిక క్వాలీటి కంట్రోల్ విభాగంలో ఆదివారం మోక్షగుండం జయంతి వేడుకలను నిర్వహించారు. డీఈఈ లక్ష్మీనారాయణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. పీఆర్ ఐ సబ్ డివిజన్-1, క్యూసీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నిట్కాన్ గ్రూప్స్ కార్యాలయంలో...

అనంతపురం క్రైం: నగరంలోని నిట్కాన్ గ్రూప్స్ కార్యాలయంలో ఆదివారం ఇంజనీరింగ్ డేని ఘనంగా జరుపుకున్నారు. గ్రూప్స్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, మురళీకృష్ణ, క్రెడాయ్ ప్రెసిడెంట్ అపెక్స్ తిరుపాలు, ప్రధాన కార్యదర్శి నిట్కాన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. క్వాలిటీ, వినూత్న సాంకేతికతలను వినియోగించుకుని మోక్షగుండం ఆశయాలు కొనసాగించాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

పామిడి, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సీఐ యుగంధర్ తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం పెన్నానదిలో ఇసుకను తరలించకుండా ఉండేందుకు రస్తాలకు ఎక్స్‌కవేటర్‌తో గుంతలను తవ్వించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇసుక అవసరమైన వారు సంబంధితాధికారులతో అనుమతులు తీసుకుని తరలించుకోవాలని సూచించారు.

వైద్యశిబిరానికి స్పందన

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 15: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించినట్లు ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణ భరత్ పేర్కొన్నారు. ఇందులో సుమారు 400 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేశారన్నారు. 112 మందిని కంటి ఆపరేషన్‌కు, 14 మందికి గుండె ఆపరేషన్‌కు ఎంపిక చేశారన్నారు. వారిని నంద్యాల ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించి మరలా రాయదుర్గానికి తీసుకురానున్నట్లు చెప్పారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కావలి ఈశ్వర్, జిల్లా జా యింట్ సెక్రెటరీ రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల శాంతిరాం ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

మిత్రుల ఆర్థికసాయం

పెద్దవడుగూరు, సెప్టెంబరు 15: మండలంలోని జి. వెంకటాంపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నాగేశ్వరరావుకు ఆయన మిత్రులు ఆర్థికసాయం అందించారు. నాగేశ్వర రావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మిత్రులు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి ఆయనకు రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. వీరంతా 1986-1987వ విద్యా సంవత్సరంలో మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్నారు. కార్యక్రమంలో చంద్రవర్ధన్‌రెడ్డి, నగేష్, కొండారెడ్డి, ఏకాంబరేశ్వరయ్య, శంకర్‌రెడ్డి, జయరాం, శ్రీనివాస్‌రెడ్డి, సుంకన్న, రంగడు, రామచంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్, సెప్టెంబరు 15: మండలంలోని ధర్మా పురం గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆది వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గుత్తికి చెందిన నరసింహ, పర మేష్ ఆదివారం బైక్‌లో ప్యాపిలికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ధర్మాపురం గ్రామాశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు వెంటనే వారిని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి ఆత్మహత్య

తాడిపత్రి, సెప్టెంబరు 15: పట్టణంలోని పోరాట కాలనీకి చెందిన వృద్ధుడు జింకా రామయ్య (63) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జింకా రామయ్య రిక్షా తొక్కుతూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తిచెందిన ఆయన శనివారం రాత్రి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి ఉంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరి అరెస్టు

తాడిపత్రి, సెప్టెంబరు15: మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో మూడురోజులక్రితం గేదెలను అపహరించిన కేసులో ఆదివారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మారుతి, వంగనూరు గ్రామానికి చెందిన బాబు కలిసి మూడురోజుల క్రితం గన్నెవారిపల్లికాలనీలో పరమేశ్, మనోహర్‌కు చెందిన మూడు గేదెలను అపహరించించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మండలంలోని తేరన్నపల్లి వద్ద నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక గేదెను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన రెండు గేదెలను విక్రయించగా వచ్చిన రూ.లక్షను కూడా స్వాధీనం చేసుకున్నామని వారు చెప్పారు.

నేడు మిలాద్ ఉన్ నబీ

గుత్తి: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మసీదుల వద్ద అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కసాపురం ఎస్ఐగా నరేంద్రకుమార్

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 15: కసాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నరేంద్రకుమార్ ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న దుగ్గిరెడ్డి నంద్యాల జిల్లా బనగానపల్లికి బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా గుడిపాల ఎస్ఐగా ఉన్న నరేంద్రకుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ప్రత్యేక అలంకరణలో దుర్గావీరభద్రస్వాములు

లేపాక్షి, సెప్టెంబరు 15: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం దుర్గా, వీరభద్రస్వాములను రంగు రంగుల పూలతో ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. వరుస సెలవులు కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి స్వాములను దర్శించుకున్నారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల అందజేత

పామిడి, సెప్టెంబరు 15: విజయవాడలో వరద బాధితులకు పామిడి మండల టీడీపీ నాయకులు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ మండల ఇంచార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో సేకరించిన నిత్యావసర సరుకులు, దుస్తులను ఆదివారం నాయకులు బాధితులకు అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం, జత దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి పసుల శ్రీరాములు, వాల్మీకి సాధికార కార్యదర్శి సుంకప్ప, నాయకులు తిమ్మప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

● ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్న పాఠకులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 15: పదిమందికి విజ్ఞానాన్ని అందించేందుకు గతంలో మండలానికో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత బాగోగులు పట్టించుకోకపోవడంతో చాలాచోట్ల వాటి భవనాలు శిథిలావస్థకు చేరి అప్పుడో.. ఇప్పుడో కూలేలా ఉన్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం ఎప్పుడు కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో నిత్యం గ్రంథాలయానికి వచ్చే పాఠకులు భయాందోళనకు గురవుతున్నారు. కొంతమంది అయితే రావడమే మానేశారు. అధికారులు పలుమార్లు వచ్చి శిథిల భవనాన్ని చూసి వెళుతున్నారే తప్పా.. కనీసం మరమ్మతుల కోసం నిధులను కూడా మంజూరు చేయించడం లేదు. ఇక పాలకులైతే మనకెందుకులే అన్నట్లుగా ఉన్నారు. ఇందులో ఒక గదితో పాటు ఒక వరండా మాత్రమే ఉన్నాయి. గదితో పాటు వరండా పూర్తిగా దెబ్బతింది. పైకప్పు పూర్తిగా దెబ్బతిని ఇనుపచువ్వలు కనిపిస్తున్నాయి. వర్షం వస్తే గదులు కారుతున్నాయి. దీంతో పుస్తకాలు, పత్రికలు తడిసి ముద్దవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీకో డిజిటల్ లైబ్రరీ నిర్మాణం చేస్తామని గొప్పలు చెప్పింది, కానీ అవి ఎక్కడా నిర్మాణాలకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా గ్రంథాలయ బాగోగులను పట్టించుకోవాలని పాఠకులు కోరుతున్నారు.



బొమ్మనహాళ్‌లో పెచ్చులూడిన గ్రంథాలయ భవనం పైకప్పు



గ్రంథాలయంలో ఇరుకుగా కూర్చున్న పాఠకులు



మరమ్మతులకు నోచుకోని సొంత భవనం

గుత్తిలో అద్దె గదిలో..

● తీవ్ర అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్న పాఠకులు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్‌లో ఉన్న గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. అయితే అందులో పలు సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా కూర్చోవడానికి సరిపడా కుర్చీలు లేవు. ఇరుకు గది కావడం, సరైన వెలుతురు లేకపోవడంతో పాఠకులు తీవ్ర అసౌకర్యానికి గురౌవుతున్నారు. ఒకే గదిలో గ్రంథాలయం ఉంది. అందులో పుస్తకాలు పెట్టేందుకు తగినన్న ర్యాకులు కూడా లేవు. దీంతో పుస్తకాలన్నింటినీ ఉన్న ఆ నాలుగు ర్యాకుల్లో ఇరికించి సర్దారు. దీంతో పాఠకులు కావాల్సిన పుస్తకాలు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. 1993లో చెట్నేపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అప్పటి సర్పంచ్ బీవీ రమణ హయాంలో గ్రంథాలయానికి భవనం నిర్మించారు. ఆ భవనాన్ని అప్పటి రోడ్లు,భవనాల శాఖా మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. అయితే ఆ భవనం కాస్త ప్రస్తుతం శిథిలా వస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇంతవరకూ ఎవరూ మరమ్మతులు కూడా చేయించలేదు. దీంతో పదేళ్ల క్రితమే గ్రంథాలయాన్ని అద్దె భవనంలోకి మార్చారు. ఆ అద్దెగదిలో ఇరుకుగా గ్రంథాలయ నిర్వహణ కొనసాగుతోంది. ప్రతి రోజు అధిక భాగం సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు గ్రంథాలయానికి వస్తుంటారని స్థానిక గ్రంథాలయ అధికారిణి హేమలత తెలుపుతున్నారు. ఇప్పటికైనా పాఠకుల సౌకర్యార్థం గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆమెతో పాటు పాఠకులు కోరుతున్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

● మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 15: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం జేవీవీనాయకులు ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్పయాదవ్‌ను ఉత్తమ ఇంజనీరింగ్ అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, రిటైర్డ్ తహసీల్దార్ ఈఓ రాముడు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రోటరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఇంజనీర్స్ డే పురస్కరించుకుని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అబ్దుల్‌సత్తార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇన్‌చార్జి మురళీమోహన్‌కు రోటరాక్ట్ అర్బన్ ప్లానింగ్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేశారు. రోటరాక్ట్ జిల్లా ప్రతినిధి నాగార్జున కర్ణాటకం మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో ఇరువురు సాధించిన విజయాలకు గాను ఈ అవార్డులను ప్రదానం చేశామన్నారు. అనంతరం అబ్దుల్‌సత్తార్, మురళీమోహన్‌కు పూలమాలలువేసి శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శివానంద, కార్యదర్శి శ్రీనివాసులు, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

యాడికి: ఇంజనీర్స్ డే వేడుకలను మండలంలోని రాయలచెరువులో లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ ఒక దేశం పునాది ఇంజనీర్లచే నిర్మించబడిందని తెలిపారు. దేశవ్యాప్తంగా అనేక ఇంజనీరింగ్ అద్భుత నిర్మాణాలకు ఆద్యులు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, ఆయన జయంతిని ఇంజనీర్స్‌డేగా జరుపుకోవడం దేశం గర్వించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, కులశేఖర్‌నాయుడు, రవిప్రసాద్, ఇస్మాయిల్, రవికుమార్‌రెడ్డి, సత్యారంగయ్య, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కుందుర్పిలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

కుందుర్పి: మండలకేంద్రంతోపాటు మండలంలోని పలు పాఠశాలల్లో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలు..

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 15: కుందుర్పి మండలం బెస్తరపల్లిలో సవారమ్మ ఆలయ అభివృద్ధి కోసం పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి జీకే కృష్ణమూర్తి రూ. 5 లక్షలను విరాళమిచ్చారు. అందుకు సంబంధించిన నగదు ను ఆదివారం గ్రామపెద్దలకు అందజేశారు. సుమారు 90 ఏళ్ల క్రితం గ్రామంలో సవారమ్మ జాతరను నిర్వహించారు. అయితే ఈ సారి వచ్చేఏడాది నుంచి జాతరను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జీకే కృష్ణమూర్తి మాట్లాడుతూ పుట్టిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఉన్నానని, ఆ దిశగా ఆలయ అభివృద్ధికి కూడా సాయం చేశానని తెలిపారు. అనంతరం ఆయన్ను గ్రామపెద్దలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



గ్రామపెద్దలకు నగదు అందజేస్తున్న జీకే కృష్ణమూర్తి

వేతనాలు చెల్లించాలి..

ఉరవకొండ, సెప్టెంబరు 15: పెండింగ్‌లో ఉన్న 9నెలల వేతనాలను వెం టనే చెల్లించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఆదివారం వారు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ 25నెలలుగా పీఎఫ్ తమ ఖాతాల్లోకి జమకాలేదన్నారు. 9 నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. ఇలా అయితే తమ కుటుంబాలను ఎలా పోషించాలని ఆవేదన చెందారు. సమస్యను అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీనివాసులు, మల్లికార్జున, మూర్తి, కేశవ, లక్ష్మీనారాయణ, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఘనంగా వైవీ కృష్ణారావు జయంతి

తాడిపత్రి, సెప్టెంబరు 15: ఏపీ రైతు సంఘం నేత వైవీ కృష్ణారావు 110వ జయంతి వేడుకలను పట్టణంలోని నెహ్రూపార్కులో ఆదివారం సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కృష్ణాజిల్లాలో జన్మించిన వైవీ కృష్ణారావు రైతు సంఘంలో వివిధ హోదాల్లో పనిచేశారన్నారు. 1986లో అఖిల భారత కిసాన్ సభకు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని, ఉమ్మడిరాష్ట్రంలో 12సంవత్సరాలపాటు శాసనమండలిలో సీపీఐ గ్రూప్‌నాయకుడిగా పనిచేశారని గుర్తు చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, ఉపాధ్యక్షులు వెంకటరాముడుయాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య , నాయకులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 15 : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన విజయ్‌కుమార్(52) మండలంలోని ఉంతకల్లు గ్రామ సమీపంలో గల హెచ్చెల్సీలో శనివారం గల్లంతైన విషయం తెలిసిందే. రెండురోజులైనా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బంధువులు, పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా జాడ కనిపించలేదు. గల్లంతైన వ్యక్తి కుమారుడు మదన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

యాడికి, సెప్టెంబరు 15: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని మండల సీపీఐ, సీపీఎం పార్టీ నాయకులు తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం వారు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1974లో విద్యార్థి నాయకుడిగా జీవితం మొదలుపెట్టిన సీతారాం ఏచూరి బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. రాజకీయవేత్తగా, సీపీఐఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా, మాజీ రాజ్యసభ సభ్యుడిగా, ఆర్థికవేత్తగా, సామాజిక కార్యకర్తగా, కాలమిస్టుగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్‌రఫీ, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, చౌడయ్య, రామయ్య, స్టాంప్‌రైటర్ జూటూరు అబ్దుల్‌రజాక్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, యూత్ నాయకులు జూటూరు మహబూబ్ రబ్బాని, జూటూరు సర్దార్, మండల కార్యదర్శి బషీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



యాడికి హైస్కూల్లో నాటి గురువులతో పూర్వవిద్యార్థులు



గుంతకల్లులో పాఠశాల వద్ద పూర్వవిద్యార్థులు

36 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు..

● యాడికి హైస్కూల్లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

యాడికి, సెప్టెంబరు 15: వారంతా 36 ఏళ్ల క్రితం యాడికి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిని చదివారు. తర్వాత అదే పాఠశాలలో ఆదివారం వారు గెట్ టు గెదర్ నిర్వహించి మళ్లీ ఇన్నేళ్లకు ఒక్కటిగా కలిశారు. 1988-89వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన సుమారు 84మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, నారాయణస్వామి, నారాయణరెడ్డి, జనార్దన్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే మృతి చెందిన ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. అంతేకాకుండా తమతోపాటు విద్యాభ్యాసం చేసి మృతి చెందిన 12మంది సహచర విద్యార్థులకూ నివాళులర్పించారు. తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సాయంత్రం దాకా అందరూ సంతోషంగా గడిపారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వే ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో గెట్‌టుగెదర్ నిర్వహించారు. సుమారు 18 ఏళ్ల తర్వాత కలిసి ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞపకాలను నెమరవేసుకున్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం



ఊరేగింపులో నృత్యం చేస్తున్న బాలికలు

కణేకల్లు, సెప్టెంబరు 15: వినాయక చ వితి సందర్భంగా మండల కేంద్రంలో నికొలువుదీరిన వినాయక విగ్రహాలు తొమ్మిది రోజుల పాటు పూజలందుకుని ఆదివారం నిమజ్జనాని కి తరలాయి. నిర్వాహకులు మండపాల్లో ఉద యం నుంచి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను ఉంచి నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపులో పిల్ల లు, పెద్దలు ఉత్సాహంగా నృత్యా లు చేసి సందడి చేశారు. రామ్‌నగర్, వినాయకనగర్, సిద్ధప్పగుడి ఏరియా, బీరప్పగుడి ఏరియాల్లో కొలువుదీర్చిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. చిక్కణ్ణేశ్వర చెరువులో నిమజ్జనం చేశారు.

రక్తదాన శిబిరం

తాడిపత్రి, సెప్టెంబరు 15: మిలాదున్నబీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని సిద్ధిబాషా దర్గా సమీపంలో ఆదివారం ఫ్రెండ్స్ సహారా సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో దాదాపు 80మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫ్రెండ్స్ సహారా సొసైటీ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సభ్యులు కరీముల్లా, అలీ, అజీమ్, జిలాన్, మహబూబ్‌బాషా, అల్లాబకాష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత: ఈఓఆర్డీ

పామిడి, సెప్టెంబరు 15: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఈఓ ఆర్డీ శశికళ ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా అక్టోబరు 2వ తేదీ వరకూ స్వ భావ్ స్వచ్ఛతా - సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో శుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి రోజూ పంచాయతీ పరిధిలో స్వచ్ఛతపై స్వచ్ఛతా ప్రతిజ్ఞ, మానవహారం, పరుగు, సైకిల్ పోటీలు, ప్రభుత్వ కార్యాలయాల స్వచ్ఛత, అమ్మ పేరుతో ఒక మొక్కను నాటడం, చెత్త దిబ్బలను లేకుండా చేయడం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.

స్వచ్ఛతాహి సేవను విజయవంతం చేయండి

రాయదుర్గంరూరల్: ప్రభుత్వం ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించనుందని, గ్రామప్రజలు విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రంగనాయుడు ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో భాగంగా గ్రామీణ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ, స్వచ్ఛ పరుగు మారథాన్, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత, అమ్మ పేరుతో మొక్కలు నాటుట, ముగ్గుల పోటీలు నిర్వహించడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఉద్దేహాళ్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 15: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఆదివారం ఈఓపీఆర్డీ దాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శివన్న పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలో గత శనివారం రెండో తరగతి విద్యార్థి అజయ్‌కుమార్ విషజ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో అధికారులు, స్థానిక సర్పంచ్ కవిత గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో పూడికను తొలగించి క్లోరినేషన్ చేపట్టారు. అలాగే గ్రామంలోని రహదారులపై నిలిచిన నీటిని తొలగించి దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లారు.



డ్రైనేజీలో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

తూతూమంత్రంగా గ్రామసభ

బెళుగుప్ప, సెప్టెంబరు 15: మండలకేంద్రంలో ఉపాధి హామీకి సంబంధించిన గ్రామసభను ఆదివారం ఫీల్డ్ అసిస్టెంట్ లేకుండానే తూతూ మంత్రంగా జరిపించారు. వైసీపీ హయాంలోని ఏడాది కాలంలో చేపట్టిన పనుల్లో విపరీతంగా అక్రమాలు జరిగాయి. ఇందుకు సంబంధించిన మస్టర్లు, ఎంబుక్కులు లేవు. మండలకేంద్రంలో 1157 జాబ్ కార్డులకు కూలీలు పనిచేశారు. మట్టి పనులు రూ. 79.39 లక్షలు, పంచాయతీరాజ్ పనులు రూ. 48.42 లక్షలు, సర్వశిక్ష అభియాన్ కింద రూ. 5 లక్షలతో పనులు చేపట్టారు. అయితే వీటన్నిటికీ రికార్డులు లేవు. కూలీలు తమకు రెండు వారాల బిల్లులు మంజూరు కాలేదని గ్రామసభలో అధికారులను నిలదీశారు. ఉపాధి సిబ్బంది ఏకపక్షంగా విధులు నిర్వహించి కష్టపడి పనిచేసిన కూలీలకు అన్యాయం చేస్తున్నారని టీడీపీ నాయకులు మల్లికార్జున మండిపడ్డారు. సామాజిక తనిఖీ డీఆర్పీ బాలాజీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహించామని, రికార్డులకు, పనులకు తేడాలున్నాయని, అవకతవకలపై ప్రజావేదికలో అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.



అక్రమాలపై సభలో అధికారులను నిలదీస్తున్న టీడీపీ నాయకుడు మల్లికార్జున

24, 25 తేదీల్లో కుంటుమారెమ్మ జాతర

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 15: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో రాయదుర్గం-బళ్లారి ప్రధాన రహదారిపై వెలసిన కుంటుమారెమ్మ ఆలయంలో ఈ నెల 24, 25 తేదీల్లో అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 24వ తేదీన అమ్మవారికి గంగ పూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 25న ఆలయం ముందు సిడి మనోత్సవం నిర్వహించన్నుట్లు చెప్పారు. రెండురోజుల పాటు జరిగే జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.